# యుద్ధం కారణంగా విధ్వంసానికి గురైన యెమన్




**యెమన్** దేశంలో కలరా వ్యాధి సోకినవారి సంఖ్య పదిలక్షలకు చేరుకొందని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటి (ఐసిఆర్‌సి) ప్రకటించింది. 2017 ఏప్రిల్ నుండి ఈ వ్యాధికి గురై 2200 మంది (దీనిలో 3వ వంతు పసిపిల్లలే) మరణించారు. యెమన్ దేశ జనాభాలో 25 శాతానికి పూర్తిగా ఆహారమే లభించటంలేదని, మరో 36 శాతం ప్రజలు ఆహారకొరత నెదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) పేర్కొంది.

2017 చివరినాటికి యెమన్‌లో 50 వేల మంది పసిపిల్లలు మరణించనున్నారని 'సేవ్ ద చిల్డ్రన్' అనే ఓ ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీవో) ప్రకటించగా, ప్రతి పదినిముషాలకీ ఒక యెమన్ పిల్లవాడు చనిపోతున్నాడని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

మధ్యప్రాచ్యంలోని అత్యంత పేద దేశమైన యెమన్‌లో విధ్వంసం సృష్టించిన వెయ్యిరోజుల యుద్ధం ఫలితంగానే ఈ మానవత్వ సంక్షోభం సంభవించింది. 2014 మార్చిలో సౌదీ అరేబియా ఈ యుద్ధాన్ని ప్రారంభించింది. యెమన్ అధ్యక్ష స్థానం నుండి తొలగించబడి, సౌదీ అరేబియా పారిపోయి అక్కడ తలదాచుకున్న రబ్బు తన కీలుబొమ్మ మన్‌సౌర్ హాదీని తిరిగి అధికారంలోకి తేవడానికి సౌదీ అరేబియా ఈ యుద్ధం సాగించింది.

అమెరికా ఆయుధ పరిశ్రమ సౌదీ అరేబియాకు సరఫరా చేసిన క్షిపణులు. క్లస్టర్ బాంబులు, ఇతర ఆయుధాలను యెమన్‌పై ప్రయోగించి ఆ దేశంలోని పాఠశాలలను, ఆసుపత్రులను, నివాసగృహాలను, పరిశ్రమలను, కాలనీలను విధ్వంసం చేసి శిధిలాలుగా మిగిల్చింది. వాయు, నావికా, భూమార్గాలను సౌదీ అరేబియా, అమెరికా దేశాలు నిరోధించడం ద్వారా, బాంబుల విధ్వంసం తర్వాత బతికి బట్టకట్టగలిగినవారికి సైతం చమురు ఇతర వస్తువులను లభించకుండా నిలువరించాయి. ఐసిఆర్‌సి ప్రకారం యెమన్ దేశంలోని 60 శాతం మంది ప్రజానీకానికి కనీస ఆహారం, రక్షిత మంచినీరు, కనీస వైద్యసౌకర్యం అందే పరిస్థితి లేదు. యెమన్‌లోని 50 శాతం వైద్య సేవా సౌకర్యాలన్నీ ధ్వంసం చేయబడ్డాయి. యుద్ధం యెమన్ దేశాన్ని వ్యాధుల్లోకి, దుర్భిక్షంలోకి నెట్టివేసింది.

2002 నుండి అమెరికా సామ్రాజ్యవాదం రహస్యంగా పైలెట్ రహిత విమానాలతో యెమన్‌పై దాడులు సాగిస్తూ వస్తోంది. యెమన్‌లో భూతలంలో పలు దాడులకు పాల్పడినట్లుగా పెంటగాన్ ఇపుడు అంగీకరిస్తోంది. అరేబియా ద్వీపకల్పంలో అల్‌ఖైదాను, యెమన్‌లో 'ఇస్లామిక్ స్టేట్' (ఐసిస్)ను అది సాకుగా ఉపయోగిస్తోంది.

యెమన్ ప్రయోగించిన ఇరాన్ క్షిపణి రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విధ్వంసాన్ని సృష్టించిందంటూ, ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కిహేలీ వాషింగ్‌టన్ డి.సి.లోని తమ సైనిక స్థావరం ఎదుట దృశ్యరూపంలో ప్రదర్శించాడు. దీనిలో ఎవరూ మరణించలేదు.

ఇది ఓ కల్పిత కథ. హేలీ తన కథనంలో ప్రదర్శించిన క్షిపణి శిధిలాలలో అమెరికాకు చెందిన విడి భాగాలను కలిగివున్నట్లుగా ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ నివేదిక వెల్లడి చేసింది. అంటే, అమెరికా క్షిపణి మార్కెట్‌కు అనుగుణమైనవారెవరో ఆ క్షిపణిని ఒక దగ్గరకు కూర్పుచేసి వుంటారని అర్థమౌతోంది. అమెరికా విధించిన దిగ్బంధం కారణంగా యెమన్‌కు చమురు, ఆహారం, ఔషధాలు సరఫరా చేసే నౌకలను సైతం అమెరికా నావికా బలగాలు తిప్పి పంపుతుండగా, ఇరాన్ యెమన్‌కు ఆయుధాలను ఏవిధంగా సరఫరా చేయగలిగిందనే ప్రశ్నకు నిక్కిహేలీ సమాధానం చెప్పలేదు.

రియాద్ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని అమెరికా ప్రభుత్వం ఖండించి, ఎలాంటి కనీస ఆధారం లేకుండా ఇరాన్‌ను దీనికి బాధ్యురాలిగా ఆరోపిస్తోంది. వాస్తవానికి అమెరికానే యెమన్ ప్రజల ఊచకోతను ప్రేరేపించి, మద్దతుగా నిలిచింది.

○○○○○○